# లాబీ... లాబీ...

ఇదేదో లాలీ... లాలీలా ఒక లాలిపాటలా వుందా! ఇది దానికి సరిగ్గా వ్యతిరేకం. ఏ విషయం గురించయినా తెలియని వాళ్ళకీ, పట్టించుకోని వాళ్ళకీ, వాళ్ళకి అది తెలియటం వల్ల మనకి లాభం వున్నప్పుడు, వాళ్ళని నిద్ర లేపి ఆ విషయం చెప్పేదే లాబీ. అలా మనకి కావలసిన పనులు జరిపించుకోవటమే లాబీయింగ్. రాజకీయపరంగా ఇది అమెరికాలోనూ, ఇతర పశ్చిమ దేశాల్లోనూ ఎన్నాళ్ళనించో వున్నదే తర్వాత జపాన్ చైనాలాటి ఆసియా దేశాలకీ పాకింది.

అసలేమిటి ఈ లాబీయింగ్? ఏమా కథ? ఇది చట్ట సమ్మతమేనా?

ముందు ఈ లాబీయింగ్‌కి సులభంగా వుండే ఒక నిర్వచనం చెప్పుకుందాం. అప్పుడు దీని సంగతేమిటో తెలుస్తుంది.

నేను హైస్కూల్లో చదువుకునేటప్పుడు, స్నేహితులతో కలిసి రెండు మూడు నెలలకోసారి ఒక తెలుగు సినిమాకి వెళ్ళేవాడిని. మా నాన్నగారికి చెప్పి డబ్బులు అడగాలంటే భయం. ఆయన ఏమీ అనేవారూ కాదు, అభ్యంతర పెట్టేవాళ్ళూ కాదు. కానీ అదొక భక్తితో కూడిన భయం. నెమ్మదిగా కాసేపు మా అమ్మ చుట్టూ తిరిగి, మనసులో మాట బయట పెట్టేవాడిని. నాకు మార్కులూ బాగానే వస్తుండేవి కనుక, మా అమ్మ నా చదువు గురించీ మిగతా ఎన్నో మంచి విషయాల గురించీ చెప్పి, 'మనవాడు మంచి బాలుడు' అని కూడా చెప్పి అక్కడే నుంచునేది. ఆర్గ్యుమెంట్ విన్నాక జడ్జ్‌మెంట్ నాకు సానుకూలంగానే వచ్చేది. 'సరే జాగ్రత్తగా వెళ్ళమను' అని కావలసిన డబ్బులు కూడా ఇచ్చేవారు. ఆ రోజుల్లో మా ఇంట్లో అదే లాబీయింగ్.

'నీ నిర్వచనం అంత సరిగ్గా లేదు. దానిపేరు రికమెండేషన్. లాబీయింగ్ కాదు' అని ఒకళ్ళిద్దరు అనే అవకాశం కూడా వుంది. అవును. కాదు. మీరు ఎవరితోనన్నా ఏదన్నా రెకమెండేషన్ చేయవచ్చు. అది చేయటం, చేయకపోవటం వాళ్ళ మీద ఆధారపడి వుంటుంది. కానీ లాబీయింగ్ ఇంకా కొంచెం ముందుకు పోతుంది.

రకరకాల స్ట్రేటజీలతో సాధించదలుచుకునేది సాధించేదాకా వదలరు లాబీయిస్టులు. కొన్ని ఉదాహరణలు చెప్పుకుంటే అమెరికాలో ఇదెలా పని చేస్తుందో తెలుస్తుంది. మరి ఇది చట్టబద్ధమేనా? లంచాల ప్రమేయం లేకుండా, చట్టం పరిధిలో లాబీయింగ్ చేస్తే, చట్ట సమ్మతమే కాదు సఫలమూ అవుతుంది.

రాజకీయరంగంలో చేసే ఈ లాబీలు రకరకాలుగా వుంటాయి. రకరకాల ప్రయోజనాల కోసం చేస్తారు. కొన్ని దేశాలకి ఈ లాబీయింగ్ మంచి చేస్తే, ఇంకా కొన్ని దేశాలకి ఆ మంచి జరగకపోవచ్చు. అందుకని ఈ లాబీయింగ్ మంచిదా కాదా

అంటే రెండు రకాల సమాధానాలు వింటాము.

అమెరికా ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ సంపన్నమైన దేశం. ఎన్నో కంపెనీలు, సరుకులూ, వినిమయం, డాలర్ విలువ, అవసరాలు మొదలైనవాటితో ఏటేటా కొన్ని ట్రిలియన్ డాలర్ల వ్యాపారం మిగతా దేశాలతో చేస్తుంది. అందుకని ఆర్థికంగా ముందుకుపోయే ఏ దేశమైనా అమెరికాతో వ్యాపార సంబంధాలు కోరుకుంటుంది. అమెరికా రాజకీయ విధానాలు నచ్చినా నచ్చకపోయినా కూడా, వారి ఆర్థిక వనరులకి ఇంకొక సంపన్న దేశంగా ఎదగటానికీ అది అవసరమయేంత అవసరం పెరిగిపోయింది. కమ్యూనిష్టు చైనా కాపిటలిష్టు అయిపోవటానికీ అదే కారణం. నెలనెలా కొన్ని వేల సంఖ్యల్లో భారతీయులు ఇండియాని వదిలి అమెరికాకి వలస రావటానికీ అదే కారణం.

ప్రపంచంలో 193 దేశాలు వున్నాయి. ఆ దేశాల గురించి అమెరికాలోనే కాదు, ఏ దేశంలోనూ పూర్తి అవగాహన వున్నవాళ్ళని వేళ్ళ మీద లెఖ్ఖ పెట్టచ్చు. కొన్ని దేశాల గురించి కొంత తెలియటం వేరు. రాజకీయరంగంలో కొన్ని నిర్ణయాలకి అది చాలదు. అందుకే ఈ లాబీయింగ్ బాగా పని చేస్తుంది ఈ దేశంలో.

అమెరికన్లకి ఇండియా గురించి ఎక్కువ తెలీదు అని మనవాళ్ళు ఇక్కడ అంటుంటారు. అమెరికాలోని సామాన్య ప్రజలకి లేదా సగటు జనానీకానికి, ఇండియా గురించి తెలిసినవి రెండే రెండు. ఒకటి తాజ్ మహల్. రెండు, ఇండియా అమెరికాలోని ఉద్యోగాలని తీసుకుపోతున్నదని. ఇండియా గురించి ఎంతో తెలిసిన విజ్ఞానవంతులు హైటెక్ రంగంలోనూ, ఫైనాన్స్ రంగంలోనూ ఇక్కడా వున్నారు. కానీ వాళ్ళది ఒక పెద్ద సంఖ్య కాదు. మనం దీన్నే రెండో పక్కనించీ చూద్దాం. ఇండియాలో అమెరికా గురించి అవసరమైన సంచారం తెలిసిన వారి సంఖ్య, సగటు ప్రజానీకంలో చాల చాల తక్కువ. ఈ రోజుల్లో పెద్ద చదువులు చదువుకున్న కొన్ని ఇళ్ళనించీ ఎంతోమంది ఇక్కడికి రావటం వల్ల, అది కొంచెం పెరిగి వుండవచ్చు. కానీ అవసరమైన రాజకీయ అవగాహన వారిలో వుందనటం కష్టం. ఆ అవగాహన వుందనుకున్న కొంతమంది తెలుగు రచయితలు, కొన్ని నెలలు చుట్టం చూపుగా అమెరికా వచ్చి వ్రాస్తున్న వ్యాసాలు, కథలు చదివితే నేను వ్రాస్తున్న దేమిటో సులభంగా అర్థమయిపోతుంది.

పైన చెప్పినట్టు అమెరికన్లకి ఇండియా గురించీ, అంత స్నేహితులు కాని మిగతా దేశాల గురించీ తెలీదు కనుకా, పట్టించుకోరు కనుకా ఈ లాబీల అవసరం ఇంకా పెరిగింది. ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. ఇండియా, పాకిస్తాన్‌లు 1998లో న్యూక్లియర్ టెస్టులు చేశాయి. తత్ఫలితంగా అమెరికా ఈ రెండు దేశాల మీదా కొన్ని వ్యాపార నిబంధనలు (శాంక్షన్స్) పెట్టింది. ఇండియా కన్నా ముందుగా లాబీయిష్టులతో రంగంలోకి దిగింది పాకిస్తాన్. అంటే ఈ నిబంధనల అమలుకి కాంగ్రెస్‌లో (మన లోక్‌సభ లాటిది) ఓటింగ్‌కి వచ్చేలోపల వాళ్ళందరి దగ్గరా లాబీయింగ్ చేసి, ఓటింగ్ వాళ్ళకి సానుకూలంగా చేసుకోవటానికి చేసే ప్రయత్నం అన్నమాట. ఇండియా కూడా అదే పని చేసింది. దానితో రెండు దేశాలు ఎవరి

యధాశక్తి వాళ్ళు లాభం పొందారు.

పాకిస్తానుకి మొదటినించీ అమెరికాలో పెద్ద లాబీయింగ్ వుంది. ఎన్నో మంచి లాబీ కంపెనీలని వాళ్ళు ఉపయోగించి ఎన్నో ప్రయోజనాలు పొందుతున్నారు. సెప్టెంబర్ 11న ఉగ్రవాద చర్యలు జరగగానే, అమెరికా పక్కన నిలిచింది పాకిస్తాన్. ఒక పక్క పాకిస్తాన్ రాయబారి మలీహా, రెండవ పక్క లాబీ గ్రూపు. దానితో అమెరికాకి పాకిస్థాను ఇంకా దగ్గరయింది. ఈ మధ్యనే మళ్ళీ వాన్ స్కోయాక్ అసోసియేట్స్ అనే ఒక పెద్ద కంపెనీని 15 నెలలకి 570,000 డాలర్ల జీతంతో తమ లాబీ కోసం నియమించింది. ఇందాక చెప్పిన అణు ప్రయోగాల వల్ల, ఆకాశ యుద్ధంలో ఎంతో పేరుపొందిన ఎఫ్ 16 విమానాలని అమెరికా పాకిస్థానుకి అమ్మకుండా నిషేధం పెట్టింది. కాంగ్రెస్‌లో లాబీ చేసి, వాటిని కొనుగోలు చేయటం పాకిస్థానుకి ప్రధాన లక్ష్యం.

ఇంతకు ముందుదాకా ఇండియాకి అమెరికాలో మంచి లాబీ గ్రూపులు లేవు. మన రాయబారులు కూడా ఎవరో ఒకళ్ళిద్దరు తప్ప నాకు అంత ఘటికులుగా కనపడలేదు. గత ఏడెనిమిదేళ్ళుగా పరిస్థితి కొంత మెరుగుపడిందని అనిపిస్తున్నది. ఈ మధ్యనే సంవత్సరానికి 700,000 డాలర్లు చొప్పున బార్బర్ గ్రిఫిత్ అండ్ రోజర్స్ అనే సంస్థని నియమించారు. దీన్ని నడిపించేది ఇండియాకి మాజీ అమెరికా రాయబారి రాబర్ట్ బ్లాక్‌విల్. ఆయనకి రాజకీయరంగంలో పరిచయాలు చాల వున్నాయి. కాకపోతే 2005 నవంబర్ దాకా, అంటే పదవీ విరమణ తర్వాత ఒక సంవత్సరందాకా, ఆయన ఇండియాకి పనిచేయకూడదు. అంటే 2005 డిసెంబర్ నించీ రంగంలోకి దిగుతాడన్న మాట.

ఈ లాబీలే ఇంకో రకంగా కూడా జరుగుతాయి. ఇక్కడ ఎన్నారైలు ఒక ఫెడరేషన్ పెట్టారు. దాని పేరు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోషియేషన్స్. అమెరికాలోని పెద్దవూళ్ళల్లోనూ, చిన్న వూళ్ళల్లోనూ దానికి బ్రాంచీలు వున్నాయి. ఇలా ప్రతి చోటా స్థానిక సెనెటర్లతోనూ, కాంగ్రెస్మన్లతోనూ కలిసి ఇండియా అవసరాల గురించి చెప్పి, తదనుగుణంగా వాళ్ళు ఓట్లు వేసేటట్లు చేస్తుంటారు. మా వూళ్ళో కాంగ్రెస్మన్‌తోనూ మేము అలా కలుస్తూనే వుంటాం. ఆ మధ్య ఒక టౌన్ హాల్ మీటింగ్ పెట్టి ఇండియాకి వీసా కోటాలు పెంచటం గురించీ, భర్తలు అమెరికాలోనూ భార్యలు ఇండియాలోనూ వుంటున్న నేపధ్యంలో ఆ కుటుంబాలని త్వరగా కలపటానికి ఏం చేయాలి, ఎంత త్వరితంగా వీసాలు ఇప్పించాలి అనే విషయాల మీద, నేనే వ్యాఖ్యాతగా, మా కాంగ్రెస్మన్‌తో చర్చలు జరిపాము.

అలాగే క్లింటన్ ప్రెసిడెంట్‌గా వున్నప్పుడు ఆయన ఇండియాకి ప్రప్రధమంగా వెళ్ళటానికీ, తర్వాత ఇండియా మీద ఆయనకి ఇష్టం కలగటానికీ కూడా ఈ ఎఫ్.ఐ.ఎ.లే కారణం.

తెలుగులో ఒక చక్కటి సామెత వుంది. అడగందే అమ్మయినా పెట్టదు అని. ఈ అడగటాన్నే లాబీ అని అనవచ్చేమో!

0 0 0